సమాచారం

మహిళా ఐకాన్ అవార్డులకు దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛతా అవార్డుల కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు పోచారం మున్సిపల్ కమిషనర్ సురేష్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 7 నుంచి 30వ తేదీ వరకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛతోత్సవ్ క్యాంపెయిన్‌లో భాగంగా అవార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్, స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్స్, ఎన్‌జీఓలకు చెందిన మహిళలు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్: 915481 2774 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేటి ప్రజావాణి రద్దు: కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సోమవారం (నేడు) జరగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించలేకపోతున్నామని మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ప్రజలు సోమవారం రోజున కలెక్టరేట్‌కు రావద్దని ఆయన సూచించారు.

నేడు 14 పాఠశాలలకు సెలవు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన 14 పాఠశాలలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా...

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి

కీసర: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కీసర సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులోని సాయిబాబా కాలనీలో స్థానిక కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి తన సొంతంగా రూ.1.40లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, కాలనీ అధ్యక్షుడు సోమిరెడ్డి, సెక్రెటరీ మోహన్, ఉపేందర్‌రెడ్డి, ప్రవీన్, కాలనీ అసోషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్ చాంపియన్ లీగ్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వేణుగోపాల్

ఘట్‌కేసర్: అంకుషాపూర్ గ్రామలో 'అంకుషాపూర్ చాంపియన్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గణేశ్‌ముదిరాజ్, దీక్షిత్‌గౌడ్, బీఆర్ఎస్ శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి మహిపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



జవహర్‌నగర్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహర్షి స్కూల్ కరస్పాండెంట్ నర్సింహాచారి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మహర్షి స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేడుకలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

అంతా సిద్ధం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు.. 6,536 మంది ఓటర్లు



- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు, సిబ్బంది
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ అమయ్‌కుమార్
- నేడే పోలింగ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. ఈ నెల 13వ తేదీ సోమవారం (నేడు) జరగనున్న ఈ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలతో పాటు సిరా, ఇతర సామగ్రిని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, సిబ్బందికి అప్పగించారు. వీరంతా వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కాగా ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ అమయ్‌కుమార్ పర్యవేక్షించగా ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీఆర్‌ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

29,720 మందిలో 6,536 జిల్లా ఓటర్లే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో ఎనిమిది కీసరలో, ఆరు పోలింగ్ కేంద్రాలను మల్కాజిగిరిలో ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ సోమవారం (నేడు) ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం వరకు ఎన్నికలు పటిష్ట భద్రతల నడుమ జరగనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఓటర్లు 29,720 ఉండగా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 6,536 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 3,498 మంది కాగా.. పురుష ఓటర్లు 3,038 మంది ఉన్నారు.

సాధారణ ఎన్నికల మాదిరిగానే...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సాధారణ ఎన్నికల మాదిరిగానే నిర్వహించేందుకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. అలాగే ఎన్నికలు జరిగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ స్టేడియంకు పోలీసు బందోబస్తు మధ్య తరలిస్తారు. 16న సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

బరిలో 21 మంది.. ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఆయా అభ్యర్థులకు పరోక్షంగా పలు పార్టీలు ఆర్థిక వనరులను సమకూర్చాయి. ఎలాగైనా ఈ సీటును మళ్లీ తమ ఖాతాలో వేసుకోవాలని అధికార బీఆర్ఎస్ యత్నిస్తుండగా.. సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐలు కూడా తమ అనుబంధ సంఘాల అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో టీఎస్ యూటీఎఫ్ తరపున పాపన్నగారి మాణిక్‌రెడ్డి పోటీ చేస్తుండగా, పీఆర్‌టీయూ నుంచి చెన్నకేశవరెడ్డి, టీపీఆర్‌టీయూ అభ్యర్థిగా ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థిగా ఏవీఎన్ రెడ్డి, టీయూటీఎఫ్ అభ్యర్థిగా దేవన్నగారి మల్లారెడ్డి, ఎస్టీయూ నుంచి భుజంగరావు, మహబూబ్‌నగర్ నుంచి గతంలో పోటీ రిటైర్డ్ డీఈఓ విజయ్ కుమార్, హర్షవర్ధన్‌రెడ్డిలు పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, వీరిలో జనార్దన్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డిల మధ్య తీవ్రపోటీ జరిగింది. తొలి ప్రాధాన్యత ఓటు దక్కకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లతో జనార్దన్‌రెడ్డి విజయం సాధించారు. ఈ సారి ఎన్నికల్లో టీఎస్‌యూ టీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డి, పీఆర్‌టీయూటీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిల మధ్యే ప్రధాన పోటీ కన్పిస్తోంది.

పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	15	3,461
నాగర్‌కర్నూల్	14	1,822
వనపర్తి	7	1,335
జోగులాంబ గద్వాల్	11	877
నారాయణపేట్	5	664
రంగారెడ్డి	31	9,186
వికారాబాద్	18	1,890
మేడ్చల్–మల్కాజిగిరి	14	6,536
హైదరాబాద్	22	3,949
మొత్తం	137	29,720

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మంత్రి చామకూర మల్లారెడ్డి



ఘట్‌కేసర్‌లో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, చైర్ పర్సన్ పావనీలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమల సమర్పణ వందో వారం కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్, టీఎస్ ఎస్‌జీడీసీఎఫ్ చైర్మన్ బాలరాజ్ యాదవ్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్మన్ పావనీయాదవ్, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డితో కలిసి మంత్రి మల్లారెడ్డి విచ్చేసి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఎస్వీఎస్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అంబేడ్కర్ సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధి, అంటరానితనం, కుల నిర్మూలన కోసం పోరాటం చేశాడని, దళితుల సామాజిక, రాజకీయ హక్కుల కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్, ప్రబుద్ధ భారత్ నిర్వాహకుడు అరుణ్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జంగమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు మాధవరెడ్డి, రెడ్యానాయక్, రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతాపసింగారంలో..

ప్రతాపసింగారంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సర్పంచ్ శివశంకర్‌తో కలిసి మంత్రి మల్లారెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి మొదటి పూలమాల కార్యక్రమం ప్రారంభించారు.

ఏయూలో సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పో–2023 ప్రారంభం



ఎక్స్‌పోలో ఏయూ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఈఓ నీలిమా తదితరులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం జాతీయ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పో–2023ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఏయూ చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఎక్స్‌పోలో జాతీయ స్థాయి సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలు సీఎస్ఐఆర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, ఇండియన్ మెటీరియల్ డిపార్ట్‌మెంట్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్, అటమిక్ మినరల్ డిజన్, పుదుచ్చేరి రాష్ట్ర సైన్స్ విభాగం ఇన్‌క్యూబేటర్స్, ఎంఈసీఎల్, రాష్ట్రీయ టెక్నాలజీ విభాగం, టీపీసీఎల్, ఈఐఎల్, ఎన్ఐటీటీ, ఎంఆర్పీఎల్, ఓఎన్‌జీసీ తదితర స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఏయూ సీఈఓ నీలిమా, అధ్యాపకులు, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాలాజీ ఎన్‌క్లేవ్‌లోని సమస్యలను పరిష్కరిస్తా..



బాలాజీ ఎన్‌క్లేవ్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: బాలాజీ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ 4వ వార్డు పరిధిలో గల బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీలో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటేష్, కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్, కొత్త హేమలతశ్రీనివాస్‌గౌడ్, నానునాయక్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో కాలనీ పక్కనే ఉన్న చీర్యాల పెద్దచెరువు వాగు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను కాలనీవాసులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు త్వరలో రూ.50 లక్షలు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కొకుట్ల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

జవహర్‌నగర్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 17వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన మురుగన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కును ఆదివారం మంత్రి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



మహిళా దినోత్సవంలో మేయర్ కావ్య

జవహర్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారి అభ్యున్నతికి, రక్షణకు అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోందని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు పరుశురామ్, నాయకులు ప్రణీత్, దిలీప్, జహంగీర్, కుమార్, డివిజన్ మహిళ ఉపాధ్యక్షురాలు వీణ, స్వప్న, కృష్ణవేణి, కమలా, ఉమా, మంగ, సుభద్ర, కుమారి, సంగీత, కాలనీవాసులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'క్రాంతి కీన్' విద్యార్థుల ప్రతిభ



క్రాంతికీన్ అకాడమీ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ క్రాంతికీన్ అకాడమీలో చదువుతున్న 29 మంది విద్యార్థులు ఇటీవల ప్రకటించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 2023లో ఉత్తమ ర్యాంకులు సాధించి సీట్లు సంపాదించుకోవడం అభినందనీయమని కాలేజ్ ఆఫ్ ఎడ్యూకేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ డీన్ వి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం దమ్మాయిగూడలోని క్రాంతికీన్ అకాడమిలో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో ఆయన పాల్గొని సైనిక్ స్కూల్లో సీట్లు సాధించిన 29 మంది విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. అకాడమీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ లావణ్య, ప్రిన్సిపాల్ కల్యాణి మాట్లాడుతూ.. ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో 1, 2 ర్యాంకులతో పాటు తమ అకాడమీకి చెందిన 80 శాతం పిల్లలు ర్యాంకులు సాధించారన్నారు.

చిన్న తరహా పరిశ్రమల రూపకల్పనకు కృషి



మాట్లాడుతున్న సర్దార్ పుట్టం పురుషోత్తమ్‌రావు

కీసర: మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగుదలకు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు రూపొందించి చిన్న తరహా పరిశ్రమల రూపకల్పనకు మహిళా మాక్స్ సొసైటీ కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర ఉన్నత కార్యనిర్వహణాధికారి సర్దార్ పుట్టం పురుషోత్తమ్‌రావు అన్నారు. ఆదివారం కీసరగుట్టలో జరిగిన మహిళా మాక్స్ సొసైటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు కేక్‌కట్ చేసి ఘనంగా మహిళా దినోత్సవం జరుపుకున్నారు. సొసైటీ అధ్యక్షురాలు ఎటిగడ్డ అరుణ, డైరెక్టర్లు కీర్తన, మాధవి, ఇందిరా, రాష్ట్ర కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, కీసర శ్రీరామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిందం మహేందర్, కోశాధికారి పి.వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు కర్ర వెంకటేశ్వర్లు, తోట నరేష్, మానవహక్కుల పరిరక్షణ అధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ పాల్స్ స్కూల్ వార్షికోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న కావ్యకిషన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లోని సెయింట్ పాల్స్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గద్వాల్ ఆర్టీఓ ఎం.పురుషోత్తంరెడ్డి, ఏబీవీ ఫౌండేషన్ చైర్మన్ కావ్యకిషన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం చెట్ల పెంపకం, సెల్‌ఫోన్ వాడకం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమాదేవి, కరస్పాండెంట్ దేవాదానం, ప్రిన్సిపాల్ హిప్సిబ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన 'టెక్, ఫార్మా సంప్రతి'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ నరసింహారెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడ నల్లా నరసింహారెడ్డి కళాశాలలో మూడు రోజుల నిర్వహించిన జాతీయ స్థాయి టెక్, ఫార్మా సంప్రతి–2023 ఆదివారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యా సంస్థల చైర్మన్ నల్లా నరసింహారెడ్డి, కార్యదర్శి సీవీ కృష్ణారెడ్డి హాజరై పలు రంగాల్లో విశేష ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్స్ జనార్దనరాజు, కృష్ణమోహన్, రవీంద్రరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న కొండల్‌రెడ్డి, ఐలయ్యయాదవ్

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో ప్రమాదవశత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతి చెందిన అశోక్ కుటుంబీకులకు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్య యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించి అనంతరం కొండల్‌రెడ్డి సొంత నిధులు రూ.5 వేలు, మల్లారెడ్డి ట్రస్టు నుంచి ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్ రూ.5వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యుడు బిక్షపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, నాయకులు దయాకర్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్, నరసింహా, బాబు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధుల ఫ్రీజింగ్ తొలగించాలి

సాక్షి, సిటీబ్యూరో: గ్రామ పంచాయతీ నిధుల ఫ్రీజింగ్‌ను ప్రభుత్వం తొలగించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మేడ్చల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి గ్రామాలాభివృద్ధికి అడ్డుకట్ట వేస్తోందని, నిధులు విడుదల కాక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సుమారు 6 నెలలుగా గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల వేతనాలు రాక నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు సహకారం అందించేందుకు కృషి



శామీర్‌పేట్: ప్రజలకు తమ వంతు సహకారం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని డియర్ వన్ నియర్ వన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొండల్ రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామంలో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి సహకారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, ఎముకలు, గైనకాలజీతో పాటు ఇతర సాధారణ వ్యాధుల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సభ్యులు భానుచందర్, బాబు, అరవింద్, జయలక్ష్మీ, వైద్యులు ప్రత్యూష, సాయితేజ, అష్రఫ్ ఓవైసీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు చెల్లించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రాములు

సాక్షి, సిటీబ్యూరో: సకాలంలో ఆస్తి పన్నులను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ వేముల రాములు ప్రజలను కోరారు. ఆస్తి పన్నుల వసూలుపై మున్సిపల్ సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించి 2022–2023 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పన్నుల వసూలు వేగవంతం చేయాలని, మొండి బకాయిదారులకు రెడ్ నోట్ జారీ చేయాలని సిబ్బందికి సూచించారు. పన్నుల వసూలుకు బిల్ కలెక్టర్లతో కూడిన 10 బృందాలను ఏర్పాటు చేశామని, ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ బృందాలు ఇంటింటికీ తిరిగి పన్నులు వసూలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్‌ఓ రాంచందర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, జానీ, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రేణుక

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీతారాం వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ గబ్బిలాలపేటలో నివాసముంటున్న బాలమణి కుమార్తె రేణుక(30) ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో మహేందర్ అనే వ్యక్తితో పెళ్లి నిశ్చయించామని, అతడితోనే రేణుక వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కీసర: కీసర ప్రభుత్వ పాఠశాల 1992–93 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కీసరలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు విఠల్‌కుమార్, రత్నమాల, విజయ్‌కుమారీ, ఇతర ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.